ఓటు హక్కుపై అవగాహన

- ప్రజలు, విద్యార్థులకు కార్యక్రమాలు
- కళాజాతాలతో పల్లెల్లో పర్యటన
- భరోసా కోసం పోలీసుల ఫ్లాగ్ మార్చ్



అశ్వాపురం: ఫ్లాగ్‌మార్చ్‌లో సీఐలు రవీందర్, శివకుమార్, ఎస్సైలు సురేష్, రాజారాం, సిబ్బంది



భద్రాచలంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని భద్రాచలం ఎన్నికల నోడల్ అధికారి పి.సమ్మయ్య అన్నారు. పట్టణంలోని బీఈడీ కళాశాలతో పాటు పలు ప్రధాన కూడళ్లల్లో ఎన్నికల అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విధంగా వివరించారు. అలాగే కళాజాతా ఆధ్వర్యంలో ఆటపాటలతో ఓటు విలువను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో సహాయ నోడల్ అధికారి వీర్రాజు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రలోభాలు, బెదిరింపులకు గురికావద్దు

అశ్వాపురం: ఎన్నికల్లో ప్రజలు ప్రలోభాలు, బెదిరింపులకు గురికావద్దని స్వేచ్ఛగా, ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అశ్వాపురం సీఐ జి.రవీందర్ అన్నారు. మండలంలో స్వేచ్ఛాయుత, శాంతియుత ఎన్నికల నిర్వహణకు ప్రజలను చైతన్య పరుస్తూ గురువారం పోలీసలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామం నుంచి మల్లెలమడుగు, రామచంద్రాపురం, నెల్లిపాక వరకు పోలీస్ సిబ్బంది, టీఎస్ఎస్‌పీ, సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజలను ఉద్దేశించి సీఐ రవీందర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో డబ్బులిస్తామని ప్రలోభాలకు గురిచేసిన, బెదిరింపులకు పాల్పడిన వెంటనే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు, ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. ఫ్లాగ్ మార్చ్‌లో ఏడూళ్లబయ్యారం సీఐ శివకుమార్, అశ్వాపురం, కరకగూడెం, ఏడూళ్లబయ్యారం ఎస్సైలు సురేష్‌కుమార్, రాజారాం, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అందరికీ పథకాలు

మణుగూరుటౌన్: అభివృద్ధిని, తెలంగాణ ప్రజల మేలును కాంక్షించే కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండలం, పట్టణంలో గడపగడపకూ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లును గెలిపించాలని అభ్యర్థించారు. విప్పలసింగారం పంచాయతీ, సమితిసింగారం, రామానుజవరం, పగిడేరు తదితర గ్రామాల్లో ప్రచారం సాగింది. ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, పాల్వంచ రాములు, డాక్టర్ కల్యాణ్, గాండ్ల సురేశ్, బత్తుల నవీన్, కొత్తపల్లి సత్యనారాయణ, చల్లా రాము, బత్తుల కోటయ్య, పెనుగొండ సాంబశివరావు, కుర్రం రవి, వాగబోయిన శ్రీను, రాము, జగన్, సుబ్బారెడ్డి ఉన్నారు.

కరకగూడెం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి జరుగుతుందని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ఆకాంక్షించారు. గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ తోలెం నారాయణ, మాజీ సర్పంచ్ పాయం బాబుతో సహా ఇతర పార్టీల పలువురు నాయకులు మణుగూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీ నాయకులు యర్ర సురేష్, రావుల రవి, పాపారావు, ఎట్టి నర్సయ్య, మధు సందీప్, ఇలీయాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుజాత, భిక్షమయ్య

రాహుల్ సమావేశానికి కదలిరండి

మణుగూరుటౌన్: పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద జరగబోయే ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు పినపాక నియోజకవర్గ సీపీఐ, కాంగ్రెస్, వైఎస్సార్‌టీపీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి బహుమతిగా అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

రోడ్‌షోను జయప్రదం చేయాలి

అశ్వాపురం: ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ శుక్రవారం మణుగూరులో పర్యటిస్తారని రోడ్‌షో కార్యక్రమాన్ని మండలంలోని కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యులు, అభిమానులు జయప్రదం చేయాలని ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య కోరారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్ బట్టా సత్యనారాయణ, గిరిజన సంఘం నాయకుడు పొడియం అనిల్‌కుమార్, నాయకులు కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, సదర్‌లాల్, బొబ్బాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులను కేటాయించింది. భద్రాచలం నియోజకవర్గంలో మొత్తం 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇర్పా రవికుమార్‌కు బీఎస్పీ తరుపును ఏనుగు, కారం పుల్లయ్యకు సీపీఎం తరపున సుత్తి కొడవలి, నక్షత్రం, కుంజా ధర్మారావుకు బీజేపి నుంచి కమలం పువ్వు, తెల్లం వెంకట్రావ్‌కు బీఆర్ఎస్ తరుపున కారు, పొడెం వీరయ్యకు కాంగ్రెస్ తరుపున హస్తం గుర్తులను కేటాయించారు. ఇక రిజిస్టర్ కాబడి గుర్తింపు పొందని రాజకీయ అభ్యర్థులుగా ఇతరులను చేర్చారు.

వీరిలో గోండ్వానా దండకారణ్య పార్టీ క్రింద చింత అరుణకు తురా ఊదుతున్న మనిషి గుర్తు, భారత చైతన్య యువజన పార్టీ తరుపున పూనెం ప్రదీప్‌కుమార్‌కు గన్నా కిసాన్, విద్యార్థుల రాజకీయ పార్టీ తరుపున మడకం మిత్రకు బ్యాట్, ధర్మ సమాజ్ పార్టీ తరుపున రవ్వ భద్రమ్మకు బ్యాటరీ టార్చ్‌ల గుర్తులను ప్రకటించారు. కాగా ఇండిపెండెట్‌లుగా పోటీ చేస్తున్న ఉబ్బా సీతారాములు వజ్రం, నక్కా సాయిబాబుకు గ్లాస్ టంబ్లర్, పాండ్ర హేమసుందర్‌కు ఉంగరం, మర్మం తిరుపతమ్మకు కుట్టు మిషన్ గుర్తులను ప్రకటించారు.

'జారె' కోసం నేతల విస్తృత ప్రచారం

చంద్రుగొండ: కాంగ్రెస్‌పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం చంద్రుగొండలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. హస్తం గర్తుపై ఓటు వేసి జారే ఆదినారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆరు గ్యారంటీల పథకాలకు సంబంధించి కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు భోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, నల్లమోతు రమణ, గాదె శివప్రసాద్, ఉప్పతల ఏడుకొండలు, అంతటి రామకృష్ణ, రామారావు, రుక్మిణి, కె.పుల్లయ్య, ఎస్‌కె.మదార్‌సాబ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జారే ఆదినారాయణ గెలుపు కోసం గురువారం ఆ పార్టీ నాయకులు గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. మండలంలోని పేరాయిగూడెం, మోడల్ కాలనీ, నారాయణపురం ఎస్సీ కాలనీ, ఆసుపాక, అశ్వారావుపేట మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారెంటీ కార్డులను వివరించారు. ఎన్నికల్లో అభ్యర్థి జారే ఆదినారాయణకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూపల్లి రమేష్, ఎంపీటీసీ సభ్యులు మిండా హరి, మాజీ ఎంపీటీసీ సభ్యులు నంద్రు రమేష్, మాజీ సర్పంచ్ కునసోతు లింగయ్య, జ్యేష్ఠ సత్యనారాయణ, తుమ్మా రాంబాబు, ఫణి తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండ: ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ములకలపల్లి: జారే విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ములకలపల్లి మండలకేంద్రంలోని పురవీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ.. హస్తం గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, టీడీపీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య, తాండ్ర ప్రభాకర్‌రావు, ములకలపల్లి ఉపసర్పంచ్ శనగపాటి అంజి, శ్రీరాముల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మూకమామిడి జీపీ పరిధిలోని సాయిరాంపురం గ్రామానికి చెందిన 120 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా, పార్టీబాధ్యులు కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు.

జారె పరామర్శ

ములకలపల్లి: ఆటోలు ఢీ కొన్న ఘటనలో మృతిచెందిన ఊరబెద్ది నాగమణి కుటుంబాన్ని అశ్వారావుపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జారె ఆదినారాయణ సందర్శించారు. మండలపరిధిలోని కమలాపురం గ్రామంలోని బాధిత కుటుంబాన్ని గురువారం సందర్శించిన ఆయన, నాగమణి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి ఘటన వివరాలు అడిగి తెలుకున్నారు. రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. స్థానిక నాయకులు నాగళ్ల వెంకటేశ్వరావు, బాల అప్పారావు, అడపా నాగశ్వరావు, ఊరబెద్ది వెంకన్న, గొల్ల తిరుమల పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు మద్దతు అవాస్తవం

దమ్మపేట: బీఆర్ఎస్ పార్టీకి, టీడీపీ మద్దతు తెలుపుతున్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్న సందేశం అవాస్తవమని ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు పేరుతో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా అవాస్తవమన్నారు. కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తే, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎండి.వలీ పాషా, గడ్డిపాటి సత్యం, చందా సుబ్బారావు, నందమూరి నాగు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే టీడీపీ మద్దతు..

అశ్వాపురం: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు తుళ్లూరి ప్రకాష్‌రావు తెలిపారు. గురువారం ఆయన అశ్వాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులకు భారత రాష్ట్ర సమితి పాత్ర కూడా ఉందని అందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

బీఎల్‌ఓలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్

అన్నపురెడ్డిపల్లి: బీఎల్‌ఓలతో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ తన కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఓటర్ స్లిప్పులు, ఓటర్ గైడ్, ఓటర్ కరపత్రాల పంపిణీపై వారికి అవగాహన కల్పించారు. ఓటర్ స్లిప్పును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అన్నపూర్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ

భద్రాచలంఅర్బన్: ఎన్నికల్లో భాగంగా భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని భద్రాచలం పట్టణంలో ఓటర్ సమాచార స్లిప్ పంపిణీకి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉన్న 39 వేల 685 మంది ఓటర్లకు స్లిప్పులతో పాటు ఓటర్ గైడ్, సి–విజిల్ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 41 మంది బీఎల్‌ఓలు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా పట్టణ వాసులతో బీఎల్‌వోలు మాట్లాడుతూ.. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పారదర్శకంగా ఓటు వేయాలని, ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని అన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతి ఒక్కరూ సి–విజిల్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1950పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

కరకగూడెం: అన్ని వర్గాల సంక్షేమం సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, పినపాక బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలోని పాలకమ్మతోగు గ్రామంలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటేసి తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగా కాళిక, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెం: వరి కోస్తున్న విప్ రేగా కాంతారావు

కరకగూడెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు గురువారం మండలంలోని పోలకమ్మతోగు గ్రామంలో పర్యటించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ఓ రైతు పొలంలో వరి కోశారు. ఆయన మాట్లాడుతూ.. వరికోస్తా.. ఎన్నికల్లో ఓట్లు రాల్చుతా అని ధీమా వ్యక్తం చేశారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో రేగా కాంతారావు పాల్గొన్నారు. గ్రామంలో సీపీఐ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ కమటం ఎల్లయ్యతో పాటు, వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాలు ఆయన సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కోడి కృష్ణవేణి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు మామాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కారు గుర్తుపై ఓట్లు వేయాలని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) కోరారు. అశ్వాపురంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కందుల కృష్ణార్జున్‌రావు, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, యుజవన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, ఉపసర్పంచ్ భూక్యా చందూలాల్, నాయకులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: దళిత కుటుంబాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకువచ్చిన దళితబంధు పథకం ఓ వరమని, దళితులు బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వలదాసు సాలయ్య అన్నారు. గురువారం బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ భూపెల్లి నర్సింహారావు, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు చెక్కా నర్సింహారావు, ఈసంపల్లి వెంకటేశ్వర్లు, కోట జయరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

అశ్వాపురం: అంబేడ్కర్ ఆశయాల సాధనలో భాగంగా దళితుల సమగ్ర అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ పినపాక నియోజకవర్గం అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు తోకల లత, యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ పాల్గొన్నారు.

చాగల్లులో రామయ్య కల్యాణం

భద్రాచలంటౌన్: ఏపీలోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పది రోజుల పాటు జరిగే భద్రాద్రి రామయ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని చాగల్లులో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సీతారాముల వారి ఉత్సవ మూర్తులను మండపంలో కొలువుదీర్చి విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించి కల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామయ్య కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో భద్రాద్రి రామాలయ అర్చకులు, సిబ్బంది, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం



మణుగూరురూరల్: భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నప్రసాద దాత సాధనాల రాము–లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయ కమిటీ వారు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు. అన్నప్రసాదదాత సాధనాల రాము దంపతులను ఆలయ కమిటీ వారు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సాధనాల రాము కుటుంబ సభ్యులు రుష్యేంద్రకుమార్–భానుప్రియ దంపతులు, విజయ్‌భాస్కర్–సత్యాదేవి దంపతులు, చంద్రశేఖర్–చందన దంపతులు, సాయిరాహుల్, శ్రీలేఖ, హేమంత్ వర్షసాయి, శ్రీవాత్సవ్, సాయిశశాంక్, జాశ్రీత, ఆలయ కమిటి సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, భక్తులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా వారి ఆలయంలో గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన దివంగత వైద్యుడు ఆర్.నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి స్వర్ణకుమారి కార్తీక మాసం తొలి గురువారం సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యలమర్తి లక్ష్మి, శ్రీనివాస ఆనంద్, తుమ్మలపల్లి సత్యనారయణమూర్తి, కుంచాల రమేష్ పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా అఫ్రోజ్

కరకగూడెం: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ) మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అఫ్రోజ్‌ను నియమిస్తు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే నియామకం అమలులోకి వస్తుందని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ అఫ్రోజ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా నియమించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి, జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సురేష్

చంద్రుగొండ: ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా గుర్రం సురేష్ గెలుపొందారు. గురువారం జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో సురేష్ మొత్తం 29 ఓట్లకు గాను 5 ఓట్ల మెజారిటీతో సురేష్ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా గుగులోతు హనుమా, కోశాధికారిగా బండ్ల నాగరాజు, కార్యక్రమంలో జిల్లా నాయకులు మారుతి ప్రకాష్, కీసర సుధాకర్ రెడ్డి, బి.రామకృష్ణ, బి.అనిల్, పి.రమేష్, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు రామాలయంలో వైద్యశిబిరం

భద్రాచలం: భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం ఉచిత హోమియో, ఆయుర్వేదిక్, యునాని వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. ఉదయం 9నుంచి 11 గంటల వరకు శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు, సిబ్బంది ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కోరారు.

కాంగ్రెస్‌లో ఎంపీటీసీల చేరిక

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక ఎంపీటీసీ గాదె జయ గురువారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో గురువారం ఖమ్మంలో కాంగ్రెస్‌లో చేరారు.

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ మడ్డి వనజ ఎమ్మెల్యే పొడెం వీరయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రచార హోరు

దమ్మపేట: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తనను గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని పట్వారిగూడెం, అంకంపాలెం, ఆర్లపెంట, గండుగులపల్లి తదితర గ్రామాల్లో గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. తాటి వెంకటేశ్వర్లు, సున్నం నాగమణి, వగ్గెల పూజ, భూక్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలో వివిధ పార్టీల ఎన్నికల ప్రచారం గురువారం ఉపందుకుంది. లక్ష్మీనగరం గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పొడెం వీరయ్య ప్రచారం చేపట్టి గెలిపించాల్సిందిగా కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు విజయం కోరుతూ బీఆర్ఎస్ శ్రేణులు లక్ష్మీనగరం, వెంకట్రామపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.దుమ్ముగూడెం గ్రామంలో సీపీఎం పార్టీ వినూత్నంగా జోలె పట్టుకుంటూ కారం పుల్లయ్యకు ఓటేయాలని ప్రచారం చేపట్టారు. పలుగ్రామాల్లో బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ,ఎంపీపీ రేసు లక్ష్మి ఇతర నాయకులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: సీపీఎం భద్రాచలం అసెంబ్లీ అభ్యర్థి పుల్లయ్యను గెలుపు కోరుతూ భద్రాచలం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ శ్రేణులు గురువారం ప్రచారం నిర్వహించారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు మిడియం బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్, జోన్ కన్వీనర్ బెల్లంకొండ కుసుమ, పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు మర్లపాటి రేణుక, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు భీమవరపు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బూత్‌ల వారిగా కమిటీలు వేసి జనసేన, బీజేపీ అభ్యర్థిని ముయ్యబోయిన ఉమాదేవి గెలుపునకు కృషి చేయాలని జనసేన పార్టీ అబ్జర్వర్లు చాగంటి మురళీ కృష్ణ, దుంపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. డేగల రాము, ఇస్లావత్ వినోద్, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి..

ములకలపల్లి: సీపీఎం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన కార్మిక ఉద్యమ నేత పిట్టల అర్జున్‌ను గెలిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంవి.అప్పారావు పిలుపునిచ్చారు. ములకలపల్లిలో గురువారం జరిగిన సంఘ జనరల్‌బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు దుబ్బా ధనలక్ష్మి, మండల కన్వీనర్ నిమ్మల మధు, బుగ్గా వెంకటనర్సమ్మ, ఓరుగంటి శ్రీను, వర్కా రుక్మాంగధరరావు, అంజమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: కార్మికుల పక్షాన పోరాడే సీపీఎంపార్టీ అభ్యర్థి పిట్టల అర్జున్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని సీఐటీయు మండల అధ్యక్షుడు రామడుగు వెంకటాచారి పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎంపార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విప్పర్ల వెంకటేశ్వర్లు, రుక్మిణి, రమాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొయ్యిని పూడ్చాలని వినతి



గొయ్యి వద్ద పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలోని పోషంపల్లి బ్రిడ్జిపై ఏర్పడిన పెద్ద గొయ్యిని పూడ్చాలని కోరుతూ రైతులు గురువారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జిపై పెద్ద గొయ్యి ఏర్పడిందని, తద్వారా వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కరంగా మారిందన్నారు. వరి కోతల సమయం కావడంతో ధాన్యం తరలించే వాహనాలు వచ్చి పోయేందుకు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఈ గొయ్యిని పూడ్చాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు, గ్రామపెద్దలు గువ్వా రాంబాబు, పప్పుల ప్రసాద్, గంగారాజు, దయాకర్, బుచ్చిరాములు, వజ్జా ఆనంద్, సారయ్య, రాజా, నాగేశ్వరరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.